# రత్తి కోకకట్టింది

కిట్టకాలవకు నీరొచ్చిందంటే గూడెంలోవుండే కూల్జనం ఆ వాసన పీలుత్తా లెగిసి కూకుంటారు. ఆ వాసన పీలుత్తేనే ఆళ్ళ మొగాలకి రంగొచ్చుద్ది. రంగు రాటమంటే, కోతల్లో రాల్చుకుండ తిండిగింజలు ఎండదెబ్బలకి ముంగల్నే నలసుకుపోటాన, వడతీత సాగేతలికి నె(రైబగిల్న రేగడిగడ్డన పీక్కబోయిన డొక్కల్తో పొల్లాడ్తుండ జీవాలు, కిట్టకాలవతడి సల్లగా తగిలేతలికి, వానసినుకు తగిల్న కప్పలకిమల్లే బెకబెకమంటా తిండిగింజలకి నోళ్ళు దెరసుకు లెగిసి కూకుంటారన్న మాట.

ఇగ సాగుతయి నాట్లు. నాట్లు సాగటవంటే కూల్జనం పుట్టబద్దలయిన వుసుళ్ళకిమల్లే రేగడి బురదలో భూమి యావత్తూ యాడజూసినా తిరుగాడ్తా, పాటు పాడ్తా, యీరంగాలేసుకుంటా, బురదనీలు సల్లుకుంటా, కోకలెగ్గట్టి, పంచలు బిగ్గట్టి, పిట్టలొచ్చి గింజను పట పట పట పొడుత్తా పోయినట్టు చిట పట చిట పట మిసినీకిమల్లే నారునాడ్తా పోతారన్నమాట.

నాట్లు రాటమంటే, రంగుకోకలు కట్టుకుండ కూల్జనం ముటాదార్లు నాలుగు పక్కలా కోపేసి నడిపిత్తావుంటే కొప్పుల్లో పూలు దోపుకుంటా, నోట్టో పువాకు ముక్క ఏసుకుంటే ఏసుకుంటా, చీతాం అనుకుంటే చుబ్బాం అనుకుంటా, సేతి గాజులు సరిజూసుకుంటూ, కాలకడాలు కొట్టుకుంటా, నాటుకు సోల్పున పోతావుంటే పక్కపక్క అరుగులమీన, రాత్తాపక్క సెట్ల మొదళ్ళకాడ కాత్తె సుమారైన వూరిజనం నడుంకట్లేసుక్కూకుని, పువాకు యీనెల దీసుకుంటా నోళ్ళు దెరసుకు నీలుగారుత్తా సూత్తావుంటారన్నమాట.

ఈ యవదానంలో – కోడి పెట్టిన గుడ్డు పిల్లయి కూకుండట్టు – నిన్న మొన్న దాకా ఎలికతోకల జడలేసుకుని ఏ అరుగుల మొత్తల బడ్తే ఆ యరుగు మొత్తలకాడ తచ్చాడ్తావుండే పిల్లముండలు యిట్ట తెలవకుండానే వుండట్టుండి, రంగుకోక లెగ్గట్టి నునుపెక్కిన టిసీను ఆవజాన కూల్జనంతో పడి పోతావుంటే, కూకుని పరీచ్చగా సూత్తావుండ అసువంటి సుమారయిన వూరిజనానికి నరాల పొట్టుదప్పి నీలుగార్తయ్యన్నమాట.

అయితే యీమద్దెనే కొత్తె పెద్దమడ్సుయిన రత్తికి ఎలికజడబోయి బంతికి మల్లే కొప్పొచ్చి, పోయిన మార్నాల పండక్కి జేజి కొనిపెట్టిన ఎఱ్ఱకోక ఎగ్గట్టి, తెల్లగన్నేరు పూలు కొప్పులో దోపుకుంటూ, అందర్లోబడి నాట్లకి ఎల్తావుంటే సూత్తా కూకుండ నలుగుర్జనానికి తను ఎట్టగుపిత్తావుండది ఎట్ట తెల్చుద్ది?

శివమ్మగారి శివయ్య, బసమ్మగారి సుబ్బయ్య రాత్తా పక్క సింసెట్టు కింద పువాకు ఈనెల్తీసుకుంటా ఎల్తావుండే కూలిజనాన్ని-వూరకనే సూత్తా కూకుండారు.

'సుబ్బయ్యా?"

"ఏందిర శివయ్యా?"

"ఆ పొయ్యే మడ్సి మన రంగయ్య కూతురు రత్తెట్టా" అన్నాడు శివయ్య మీసకట్టు తుడుసుకుంటా.

"అదే చూత్తన్నా" అన్నాడు సుబ్బయ్య రత్తిపోకడ కనిబెడ్తా.

"ఎదిగిందే!" అన్నాడు శివయ్య.

"పొందుకుమల్లే పండింది" అన్నాడు సుబ్బయ్య.

"తల్మొండమొయ, బల్ గురిగా ఒదిలావే మాట;" అన్నాడు శివయ్య సుబ్బయ్యను అట్టొక సూపు జూసి.

"ఉండ విషయం అది, సెప్పొద్దూ!" అన్నాడు సుబ్బయ్య సిన్నగా నవుతా.

"సినిమాకిమల్లే వుండదే!" అన్నాడు శివయ్య.

"సినిమా ఏందిరోవ్ శివయ్యా!" అడిగాడు సుబ్బయ్య.

"ఎహె మొన్నంటే మొన్నడ్డాకా ఎలికితోకకుమల్లే ఇంతజడేసుకుని తిరుగుతుండేదంటే!" అన్నాడు శివయ్య.

"ఎవరు రత్తేనా? ఈ మద్దెనే పెద్దమడ్స యిందంటలే" సెప్పాడు సుబ్బయ్య.

"ఇంగనేం, యీసారిస్తా వుండావన్న మాటా? మరి మనిషే కొత్తదన్నట్టు మాట్టాడ్తావేరా సుబ్బయ్యా!" అన్నాడు శివయ్య.

"ఓరి పోరా యెంత సెడ్డా నీకుందంత రంది నాకేడుంది!" అన్నాడు సుబ్బయ్య.

"మరి జాడా తియ్యంది నీకెట్టతెల్సురా అది పెద్దమడ్సయిందనీ?" అడిగాడు శివయ్య.

"అంతేనా! మడ్సినిజూత్తే ఆ మాత్రం తెలవదెట్టా? అయినా నీకు నాకుమల్లే

నలుగురూ అనుకుంటావుంటే యియన్నీ యినిపిచ్చుకోకబోయినా తెలుస్తావుంటయ్యే!" యిదదీసినట్టు సెప్పాడు సుబ్బయ్య.

"అంతేననుకో" ఒప్పుకున్నాడు సుబ్బయ్య.

"అళ్ళ జేజి దెలుసా?" అన్నాడు శివయ్య!

"ఎవరి జేజి?" అన్నాడు శివయ్య.

"రత్తి జేజంటే?"

"ఎవరు రోసమ్మేనా? అదిగేం రత్తిపక్కనే ఎల్తా."

"పక్కనే ఎల్తుండదంటాడూ. కరుసుకుని ఎల్తుంటే?" అన్నాడు సుబ్బయ్య.

"కాపలా ఎట్టా?"

"మరేంది! అబ్బో ఈ ముసలోళ్ళ సంగతి యింకా నీకు బాగా తెలవదు గావాల్ను- చరేలే? అసలీ రోసెమ్మ మాటకి ముంగలే రోక లెత్తుద్దంట" అన్నాడు సుబ్బయ్య.

"ఏంటి, రత్తిమీద ఎవరన్నా కన్నేస్తారనేనా?"

"అదే దానాట"

"ఆఁ ముసల్దీ! ఓరి పోరా యీ గూడెంజనం మనకి కొత్తంటా! అసలెందుకు పద్దినాలు నువు ఓపిక పట్టి సూడు. యవారం ఎట్టదిరుగుద్దో సెక్రందిరిగినట్టు!" అన్నాడు శివయ్య.

"ముసలాళ్ళకి కక్కుర్తి బొహు జాస్తంటలే. ఇంత సిన్న ఎండిబిల్ల సేతిలో బద్దేసరి" అన్నాడు సుబ్బయ్య.

"మరింగనేం!" అన్నాడు శివయ్య.

"అన్నట్టు వెంకట్రామయ్య నాల్దినాల్నుంచి యీ రోసెమ్మోళ్ళ గుడిసెల కాడే తిరుగుతూవుండాడంట దేనికబ్బా!" అన్నాడు సుబ్బయ్య.

"ఎవరు అంకమ్మగారి ఎంకట్రామయ్యా!"

"మరింకెవరు ఆడుగాకుంటె"

"ఆరి– ఆణ్ణోపాలి నలగబొడవాల్సిందే" అన్నాడు శివయ్య.

"పెతోడి కన్నూ రత్తిమీదనే. అందుట్లో ఈడు జేరాడా" – అన్నాడు సుబ్బయ్య.

"నువుమటుకు వూరకనే వుండేవోడివికాదే" అన్నాడు శివయ్య.

"చా, నీతోడు. అసలు గూడెంసాయలకి ఎల్లే వారం పద్దినాలయితే. యింకా నువేమన్నా బోగట్టా జేశావేమోనని అడుగుదామనుకుంటుంటే!" అన్నాడు సుబ్బయ్య.

"ఏంది-? తల్మొండమొయ నువురా మనగాడివంటే సుబ్బయ్యా! అసలందుగ్గాదూ నీకు కళావరుమణేలా అని పేరొచ్చింది! ఇసక తక్కెడ పేడతక్కడని కతోటుండదిలే; అట్టుండది నీ యవారం జూస్తే."

"అబ్బే గూడెం కెల్లేమన్నా ఎల్తుండావేమోనని అడిగాలే" అన్నాడు సుబ్బయ్య.

'ఏహె, యిదియ్యాల కోకగట్టుకు అగుపిస్తే చూడాల్సొచ్చిందిగాని యింతకి ముంగల దీనిమొగం ఎవరుజూశారూ?" అన్నాడు శివయ్య.

"అన్నట్టు రోసెమ్మోళ్ళు ఎంకట్రామయ్య సేనుకే నాటుకుపోయింది, తెల్సా?"

"ఆఁ! తస్సదియ్య, ఆడ్రా ఒంటి సేతి మీద యవారం నడుపుతాడు! అప్పుడే జాడాదీశావే-నువు వూరుకుంటా!" అన్నాడు శివయ్య.

"ఆఁ, యిందాక ఎంకయ్యంటుంటే తెల్సిందిగాని లేకపోతే నా కిదేనేటట్రా పనీ-యింకా నయం!" అన్నాడు సుబ్బయ్య.

"మరి నువు యింకా మొదలుపెట్టించలేదేం నాట్లూ?" అన్నాడు శివయ్య.

"ఇంకా నీరెక్కందే, మీరో?" అన్నాడు సుబ్బయ్య.

"మాదీ మీతోపాటే అవుతుందిలే. అన్నట్టు మంగి ఏమంటున్నదీ?" అన్నాడు శివయ్య.

"అదా-! అబ్బే దాని మొగంజూసే నాలుగయిదు నెల్లయితే. ఆ రోజులన్నీ పోయినయిలే శివయ్యా, యిప్పుడేందో మనదార్న మనంపోతే బాగుందు ననిపిస్తున్నది" అన్నాడు సుబ్బయ్య.

"అబ్బోవ్! యీ సుబ్బయ్య పెద్దమడిసైతుండట్టుందే! ఓరి పోరా నాకాడంట నీ పార్సా! కిందట నూర్పిళ్ళప్పుడు కదంట్రా మంగిని ఆ డొంకలకాడ దారి దప్పించి మీ సాయిడిలోకి తీసికెల్లిందీ!" అన్నాడు శివయ్య.

"సరేలే, యింతే నన్నమాట నీకు తెలిచ్చింది? దానంతట అదేగా ఎంట పడిందీ?" అన్నాడు సుబ్బయ్య.

"ఓరి పోరా నీ మాటలకేం వచ్చిందీ! మంగి సంగతి నాకు తెలియదూ? లబోయ్ దిబాయ్మంటూ అదావజాన ఏడ్చిబోతే?" అన్నాడు శివయ్య.

"నీ కాడికొచ్చి ఏడ్సుకుండదేం? ఓరి పోరా నువుమటుకు దాన్ని వూరకనే పోనిచ్చావంటా?" అన్నాడు సుబ్బయ్య.

"నేనా-! తెలవక ఏదో ఒక్కసారి బుద్ది గెడ్డి తిన్నదనుకో. ఎట్టయితే యేం అదేం ఆశబెట్టావో ఏమో సివరికి అది ఎటూ గాకుండా ఎల్లి, ఆ ముసలోణ్ణి పెళ్ళిజేసుకుండె" అన్నాడు శివయ్య! "సరే, దానికి ఆ ముసలోడే దేముడికిమల్లే వుండే, పోనిద్దూ యిప్పుడెందుకొచ్చింది ఆ పాత పురానమంతా" అన్నాడు సుబ్బయ్య.

"నిజమంతే ననుకో," అన్నాడు శివయ్య.

"అయినా వుత్తపిల్లముండలే" అన్నాడు సుబ్బయ్య.

"ఇయ్యాలేగా అది కోకగట్టిందీ?" అన్నాడు శివయ్య.

"అంతేననుకో, నీకాడ చేబోలు పువాకుండట్టుందే-?"

"కావాలెట్టా?"

"కావాలా-? తేతేతే-"

* * *

తెల్లారి సింగారిచ్చుకు నాటు కెల్లిన రంగుకోకల కూల్జనం మాపిటేలకి పంటకాలవలకాడ, సెరువు సెప్టాలకాడ, ఒంటిమీద ఆడీగ కొట్టుకుండ బురద- కాళ్ళ కడాలూ, సేతి గాజులు సుబ్బరంగా కడుక్కుని, గీగామంటా కూలిగింజలు కొలిపిచ్చుకునేవోరూ, యింటికాడ పిల్లోళ్ళేడుత్తా వుంటారని అటిటు లగెత్తేవోళ్ళూ, బువలోకి మిరపగాయ బొరపగాయనీ, ఎఱ్ఱగెడ్డ తెల్లగెడ్డలనీ, మరసనాటికి గొబ్బరిసవుఁరు ఎట్టననుకుంటా చీసాకాయిలకి లగెత్తేవోరూ, మొగోళ్ళకి పువాకనుకుంటా, బుడ్డోడికి కాత్తేమన్నా పెట్టమంటా ఊళ్ళో ఆమూల యీమూల, కోవఁటి కొట్లకాడ కాళ్ళకడాల మోత బుట్టిచ్చి, సివరకి తోసేసినట్టు ఎటు జనం అటు సల్ల సల్లగా గూడెం సేరుకుండారు.

కొత్తగా కోకగట్టి జనం మద్దెకొచ్చిపడ్డ రత్తికి ఆయాల మనసంతా - బిర్జీమీన రవిలుబండి లగెత్తినట్టు కొట్టుకుంది. అదేందో రాత్తామీన నడుత్తున్నంత లెక్కా పక్కపక్క అరుగులమీన, సెట్లకింద కూకుండ మొగజనం రెండేసి రెండేసి బార్ల ముల్లుకఱ్ఱలు దీసుకుని తన ఎఱ్ఱకోకమీన పొడుత్తా ఉండట్టే అనిపించింది రత్తికి. యీ మడుసులు తన్ను యిన్నాలమించీ ఎరిగిన మడుసులు కారు. యీళ్ళ కళ్ళు కోటయకొండ తిరనాల్లో వెలఁట్రీ దీపాలకిమల్లే దగదగ మెరుత్తుండయి.

"నాటేస్తున్నంత లెక్కా ఆ ఎంకట్రామయ్య పొద్దు తిరుగుడు పువుకు మల్లె,

తనెటు తిరుగుతుంటే అటు తిరుగుతానే వుండాడు. అయినా ఎర్రకోక బొహు బాగుంది. చీతాయ్, ఎంకాయ్, యీరావుఁలు ఎర్రకోక ఎట్టుండా వుండదన్నారు. అందుకేగావాఁలు రాత్తాపక్క జనం అట్టాజూశారు? అయినా యిదేంది పాడూ, కొత్తకోక కట్టకుంటే పొడిసినట్టూరి జనం ఆవజాన సూడాలెట్టా? చీ పాడూ, చిగ్గేసుద్దీ! అదేంది మరీ ఆ ఎంకట్రామయ్య యాడో జబ్బునపడి లెగిసినోడికి మల్లే అట్ట జూత్తాడూ? నిజంగా అదేందో జబ్బే యీళ్ళకి – యామో పాడు–" అని ఎట్టెట్టనో అనుకుండది రత్తి.

అయ్య బువదిని బయట మంచాం ఏసుకుని సెం చుకర్ర వూదుకుంటా కూకుండాడు. జేజి అమ్మకీ, పిన్నావుఁకూ, రత్తికి కంచాలు పెడ్తావుంది బువదింటానికి.

ఆయాల్దాకా కుండలో గాబుల్లో పిన్నావుఁతో బాయికాణ్ణుంచి నీలుదెచ్చి పోత్తావుండ రత్తికి తెల్లారినాట్లకు తన కొత్తకోకమీన బురదమచ్చ లుంటయ్యని పించింది.

"అమ్మోవ్, సెరువుకాడ కోక జాడిచ్చుకొత్తానే?" అమ్మ నడిగింది రత్తి.

"యీవర్దాకా ఏంజేశావే– తెల్లారి జాడిచ్చుకుందువులే" అంది అమ్మ.

"నాటు కెళ్ళేయాలకు ఎట్టారుద్దమ్మా? దొబ్బు నెల్లొత్తానమ్మా" అంది రత్తి.

"ఓ యబ్బో? కొత్తకోక గట్టిందిగాని నాటెయిదుగావాఁల యీపిల్ల! ఏం అదిరిపడ్తుందదమ్మోవ్ నీ కూతురూ? యిగ సాల్లే సంబడం, పెట్టెలో దాసుకో పండక్కి బొండక్కంటా కట్టుకుందువుగాని, యియ్యాల కట్టుకుండది సాల్లే– నిచ్చేపమంటి కొత్తకోకని గాత్తా బురద నీలల్లో పొల్లచ్చుద్దంట సూడమ్మోవ్ నీ కూతురు?" అంది జేజి.

"ఆఁ యీవిడే మాగాంగా కొనిబెట్టింది! మా అయ్యినడిగి నే నింకోటి కొనిబెట్టిచ్చుకోననుకుండావా?" అంది రత్తి.

"అయ్యో వగలూ! మీ అయ్యొకటి కొనిబెడ్తే నీ మొగుడెన్ని కొనిబెడ్తాడే పిల్లా?" అంది జేజి ముచ్చటగా.

"తెల్లారి లెగుత్తే యీయిడ కెప్పుడూ మొగుళ్ళే – సూడమ్మా?" అంది రత్తి.

"అమ్మ బుల్లో! యిప్పట్నుంచి ఏం ఎగిరిపడ్తుందమ్మోవ్ నీ కూతురు! సూత్తూండావుగా, యిప్పుడెల్లి ఆ సెరువుకాడ కోక జాడిచ్చుద్దంట నీ కూతురు!" అంది జేజి.

"అయితే నువు కూడు దినవంటే రత్తీ, మేం కూకుంటుండాం, యామో నమ్మ యీపిల్లతో సావుగుండది", అంది అమ్మ.

"దానికి కోకతోనే కడుపు నిండుతుండె" అంది పిన్నాం, కంచాంకల్లి సూత్తా.

"రేపెటికి పరికినీ కట్టుకోరాదంటే! యిప్పట్నుంచీ కోకలేందమ్మా యీ పిల్లకూ?" అంది అమ్మ.

"యిగ సాల్లే వూరుకో! యింకా పరికినీ లేపిచ్చుద్దంట యీవేందో! పిన్నాం కోకేవన్నా కట్టుకుందువులే యిప్పుడేడకి బోతావు సీకట్లో", అంది జేజి.

"ఆడ నాకుమటు కేం వుండయ్యామ్మోవ్ కోకలూ," అంటన్నది పిన్నాం.

"ఉప్పుడు నీ బంగారం మేం పీక్క దిన్లేదులే నువు వూరుకోమ్మా, గాబు కాడ దొబ్బున జాడిచ్చుకురారాదంటే యాడికో వుప్పుడు పడిబోకబోతే?" అంది అమ్మ.

"సచ్చేట్టు దెచ్చిన నీలన్నీ వుప్పుడీమె కోకలు జాడిత్తా కూకుంటది గావాలు?" అంటున్నది పిన్నాం.

"నువ్వమ్మా తెచ్చిందీ? సూడమ్మా-?" అంటన్నది రత్తి.

"యిగ యియ్యాల యీళ్ళతో కూడుదిన్నట్టే. గబగబ బాయికాడ కెల్లి రెండుబుంగలు నీలు దెచ్చుకుని యీడే గుంజుకోరాదంటే కోకా - ఎల్లవేందే రత్తాం?" అంది అమ్మ, పేసీ లెందుకంటా.

"అవ్!" అంది రత్తి బుంగ సేతబడ్తా.

"పిల్లముండను ఒక్కత్తెను సీకట్లోపంపుద్ది!" అంది జేజి.

"వూఁ నంగనాసి - నే లెగవనమ్మా వుప్పుడు - అసలే వొల్లంతా యిరగ్గొట్టినట్టుంది" అంది పిన్నాం.

"నిన్నెవురేం రామన్లా పాపం-" అంటన్నది రత్తి.

"యిదగో రత్తాం" అంటా యిసుగుతో అమ్మ లెగవకతలికే బయట సెంచుకర్ర మైకంలోపడ్డ అయ్యని దాటి రాత్తా మీనకొచ్చి వాలింది రత్తి బుంగా సేదతో.

పెయ్యదూడను పాల కొదిల్నట్టు - మద్దె మద్దె ఆరీరు సూడకుండా ఎగిరెగుర్తా గబగబ బాయిదెగ్గిరకి సేర్తావుండ రత్తికి, ఎంకట్రామయ్య గోరి సావిడికాడి కొచ్చేతలికి తత్తరబుట్టింది.

"ఎవరా ఎల్లేది" అన్నదా యిగ్రహం దారిమయానకొచ్చి నిలబడ్తా. అది ఎంకట్రామయ్య కంటం మట్టిబుంగ తాప్పున బూమ్మీనపడి యెయ్యి సెక్కలుగా పగలాల్చిందిగాని - తెప్పకొయ్యని కసుర్కుండట్టు కర్సుకుంది బుంగకు రత్తి.

"ర-ర-ర-రత్తిని-" మాట కొట్టుకుంది రత్తికి.

ఎంకట్రామయ్య ఎందుకో సప్పరిత్తుండా డనుకుంది రత్తి.

"యాడికో ఎగురుకుంటా పోతావుండావే-ఎనక మీ జేజి లేదెట్టా?" అన్నాడు ఎంకట్రామయ్య సేతులు పిసుక్కుంటా.

"కోక జాడిచ్చుకోను - దొబ్బున -ఎల్లమంటేనీ-" రత్తి నాలిక మడత బడింది.

"యింగనేం - ఇదిగో-" సీకట్లో అటిటు సూశాడు ఎంకట్రామయ్య.

"ఆc-!" అంది రత్తీ.

"కాత్తే నీతో పనుండదే-"

"ఓమ్మో-!"

"ఎహె ఊరకనేలే అరవమాకా - యిప్పుడే ఎల్దువుగాని, సాయిట్లోకి ఒత్తావెట్టా-?" ఎచ్చగా ఎంకట్రామయ్య సావిడి గోడసాటుకు లాగాడు రత్తిని ఏంలేదంటా.

"ఏందీ - యాడికో అట్ట గుంజుతాడేం - యిదేందమ్మా - వామ్మో -" ఎంకట్రామయ్య కళ్ళు వెలట్రీదీపాలకిమల్లే అట్టెలిగినయ్యో లేదో, యిదిలించి దూసుకుండ దూసుకోటం - ఎల్లి బాయికాడ ఆవురావురుమంటా పద్దోసెళ్ళ నీలు తాగిన రత్తికి ఒల్లంతా సెవcటలుబట్టి గుడ్డల్డడిసినై.

"ఎవరు - ఏంది రత్తోవ్ అదే మొయిన నీలు దాగుతుండావ్!" అన్నది నీలకొచ్చి నిలబడ్డ సీతాం.

"ఎవరు-చీతాం-యదవ-సెడ్డదప్పికయిందే చీత్యాం-చీతాం-?" అంది రత్తి దడదడమంటా.

"ఏందే రత్తీ!" అంది చీతాం.

"నువేనా, యింకా యెవురో అనుకుండాలే - దొబ్బున నీలు లాగమ్మా యిద్దురం కాత్తెలెక్క కల్చెల్దాం-"

చీతాన్ని సాటుజేసుకుని ఎంకట్రామయ్య సావిడిదాట్ని - రత్తి యింకాత్తె లెక్క బోయినాక యిగ పరవాలేదనుకుంటా చీతాంతో సీలి గబగబ యింటికి మల్లింది ఆడీడ ఎల్తురు సూసుకుంటా.

గబగబ యాది మలుపుకుండా ఒచ్చి - పొలుగు దిగేసినట్టు అటనే నిలబడిపోయి - అట్ట మొగంమీనకి తొొగిసూసిందా యిగ్రహం.

"ఎవరూ-" అంది రత్తి. చినిమా జూసినట్టయి.

"నే సుబ్బయ్యన్లే - మా శివయ్యేమో ననుకుండాలే - నువు రత్తివెట్టా?" అన్నాడు సుబ్బయ్య జరుగుతా.

"వుండు ఎల్లాల-"

"ఎల్దువులే-"

"యిగ సాల్లే లెగు-"

"ఎవురూ లేర్లే" - అంటన్న సుబ్బయ్యకు పటపటపట నరాలు తెగినట్టయి సేతులు లెగుత్తుండయ్యో లేదో-

"టాప్" మని యీపుమీద పెట్లదిమ్మ మోగేతలికి - బత్తా ఎత్తేసినట్టు - బూమ్మీనకి పల్టీకొట్టి పొండుకుండాడు సుబ్బయ్య.

"యదవా;" అన్న దాయిగ్రహం సుబ్బయ్యను ఒంగిసూత్తా.

"ఓరి శివయ్యోవ్ - సత్తిన్రా-" అని మూలిగాడు సుబ్బయ్య యీపుమీన సేతుల్తో అటనే లెగిసి కూకుంటా.

"ఎవురు సుబ్బయ్యా - సచ్చాన్రానాయినా-" గబగబ సుబ్బయ్యను వాటేసుకుని లెగవదీశాడు శివయ్య.

"యిదేందిర శివయ్యోవ్-"

"అరెరెరె-ఎంకట్రామయ్య ఏటుకు సచ్చాడనుకుంటిని గదంట్రా సుబ్బయ్యా-"

"పొళ్లాద్దన్నంద్రా - కాత్తె వాటేసుకోరా నాయనా-"

* * *

ఆ రేత్తిరి ఎర్రకోక సుట్టూత్తా వెలట్రీ దీపాలు గిర్‌గిరా తిరుగుతూ టాప్ టాప్‌మంటా పగుల్తుండట్టు కలగంటన్న రత్తి సుట్టూ సల్లగా లెగిసిన జేజి ఇంత వుప్పుగల్లు దిగదుడ్చి బారేసింది.